దశాబ్ది ఉత్సవాలకు రూ.105 కోట్లు

- తెలంగాణ ఘన కీర్తిని చాటి చెప్పేలా నిర్వహించండి...
- కలెక్టర్ల సమావేశంలో సిఎం కెసిఆర్ దిశా నిర్దేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.105 కోట్లను కేటాయించింది. సంబంధిత నిధులను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి కెసిఆర్.. ఆర్థికశాఖను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో సిఎం అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డిజిపి అంజనీకుమార్‌తోపాటు మంత్రులు, ఉన్నతాధికారులు, 33 జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దశాబ్ది ఉత్సవాల కార్యచరణ, ఏర్పాట్లపై ఈ సందర్భంగా కెసిఆర్ దిశా నిర్దేశం చేశారు. పోరాటాలు, త్యాగాలతో, ప్రజాస్వామ్య పంథాలో సాధించుకున్న స్వరాష్ట్రంలో పదేండ్ల ప్రగతి ప్రస్థానాన్ని ప్రజలకు వివరించాలని ఈ సందర్భంగా ఆయన కలెక్టర్లకు సూచించారు. హరితహారం సాధించిన విజయాలను వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వరి నాట్లను ఇప్పుడు అనుసరిస్తున్న ధోరణిలో కాకుండా ముందస్తుగా సకాలంలో వేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి తెలిపారు. గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ గురించి ప్రకటన చేశారు. తెలంగాణ ఏర్పడే నాటికి ఉన్న పరిస్థితులను, ఇప్పటి గుణాత్మక అభివృద్ధితో పోల్చి ఆయన వివరించారు. మూడు వారాలపాటు నిర్వహించే రోజువారీ కార్యక్రమాల షెడ్యూల్‌ను, దాని ప్రాధాన్యతను కలెక్టర్లకు విడమరిచి చెప్పారు. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఏ రోజున ఏ కార్యక్రమం చేపట్టాలో వివరించారు. మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఆ ఉత్సవాలను జిల్లాల వారీగా వీడియో రికార్డు చేసి భద్రపరచాలని ఆదేశించారు. అదే సందర్భంలో నియోజకవర్గాలు, జిల్లాల వారీగా సాధించిన అభివృద్ధిని తెలిపే, పదేండ్ల ప్రగతి నివేదిక పుస్తకాలను ముద్రించి పంపిణీ చేయాలని సూచించారు. ఇప్పటికే నిర్ణయించిన మేరకు ఆయా రంగాల్లో సాధించిన అభివృద్ధిపై డాక్యుమెంటరీలను రూపొందిస్తున్న దృష్ట్యా వాటిని ఉత్సవాల సందర్భంగా ప్రదర్శించాలని ఆదేశించారు.

పోటీ పరీక్షల విజేతలకు అభినందనలు..

తెలంగాణ విద్యార్థులు నీట్, ఐఎఎస్‌లాంటి పోటీ పరీక్షల్లో దేశంలోనే ముందు వరసలో ర్యాంకులు సాధిస్తూ రాష్ట్ర కీర్తిని చాటుతుండడం పట్ల సిఎం హర్షం వక్తం చేశారు. ఆయా విద్యార్థులను అభినందించారు. నారాయణపేట ఎస్‌పి వెంకటేశ్వర్లు కూతురు ఉమా హారతి సివిల్ సర్వీసెస్‌లో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకును సాధించిన నేపథ్యంలో సమావేశం అభినందనలు తెలిపింది.

రైతులను చైతన్యం చేయండి...

యాసంగి నాట్లు ఆలస్యం కావడం వల్ల రాష్ట్రంలో కోతలు కూడా లేటవుతున్నాయని సిఎం ఈ సందర్భంగా తెలిపారు. మార్చి 31 లోపే జరగాల్సిన కోతలు మే నెల దాటినా కొనసాగుతున్నాయని తెలిపారు. దాంతో ఎండాకాలంలో వచ్చే అకాల వర్షాలు, వడగండ్ల వానలతో వరి పంటలు నష్టపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బాధలు తప్పాలంటే నవంబర్ 15 నుంచి 20 లోపే యాసంగి వరినాట్లు వేసుకోవాలనీ, అందుకనుగుణంగా వానకాలం వరినాటును కూడా ముందుకు జరుపుకోవాలని సూచించారు. రోహిణీ కార్తె ప్రారంభంలోనే వానాకాలం వరినాట్లు మొదలు పెట్టాలని తెలిపారు. మే 25 నుంచి 25 జూన్ వరకు వానాకాలం వరినాట్ల ప్రక్రియ పూర్తి కావాలనీ, ఈ దిశగా జిల్లా కలెక్టర్లు వ్యవసాయ శాఖ సహకారంతో రాష్ట్ర రైతాంగాన్ని చైతన్యం చేయాలని కోరారు.

సఫాయన్నకు సలాం...

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని సిఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

దశాబ్ది వేడుకల నేపథ్యంలో 'సఫాయన్నా.. నీకు సలామన్నా...' అనే నినాదంతో ప్రభుత్వం వారిని గౌరవిస్తుందని తెలిపారు. ఉత్తమ సఫాయి కార్మికులను గుర్తించి, మహిళా, పురుష విభాగాల్లో అవార్డులను అందజేస్తామని వెల్లడించారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

సమావేశంలో తీసుకున్న ప్రధాన నిర్ణయాలు...

- జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ
- బిసి, ఎంబిసి కులాల వారికి ఆర్థిక సాయం
- నియోజకవర్గానికి మూడు వేల మందికి చొప్పున గృహ లక్ష్మి పథకం అమలు
- ప్రతీ నియోజకవర్గానికి 1,100 మంది లబ్ధిదారులకు దళిత బంధు అమలు
- గొర్రెల పంపిణీని ప్రారంభించి, దశలవారీగా అమలు చేయాలి

ఎమ్మెల్యే గాదరి కిషోర్ వ్యాఖ్యలు దుర్మార్గం..

- దళిత అడ్వకేట్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి
- కెవిపిఎస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తుంగతుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే గాదరి కిశోర్ ఎంఆర్‌పిఎస్ కొడుకులంటూ పరుష పదజాలాన్ని ప్రయోగించటం దుర్మార్గమంటూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. దళితబంధు అవినీతిపై ప్రశ్నించినందుకు దళిత న్యాయవాది యుగేందర్‌పై ఎమ్మెల్యే అనుచరులు భౌతిక దాడికి పాల్పడటం సమంజసం కాదని తెలిపారు. దళిత బంధులో అవినీతి జరిగిన దానిని స్వయానా సిఎం కెసిఆర్ అంగీకరించారని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల చిట్టా తన చేతిలో ఉందని ప్రకటించారని గుర్తు చేశారు. అదే విషయాన్ని ప్రస్తావించిన దళిత న్యాయవాధీపై ఎమ్మెల్యే అనుచరులు దాడికి పాల్పడడం శోచనీయమని తెలిపారు. దళితబంధు రాజకీయలకతీతంగా అర్హులైన దళితులందరికి ఇవ్వాలనే న్యాయమైన డిమాండ్ ప్రకారం అందరికి ఇవ్వాలని కోరారు. దళిత ఎమ్మెల్యేగా ఉండి దళితులపై పరుష పదజాలం వాడడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న న్యాయవాదికి మెరుగైన వైద్యం అందించాలని, దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ తుంగతుర్తి నియోజకవర్గంలో శాంతిభద్రతల సమస్యను సృష్టించడం సరికాదని పేర్కొన్నారు. ప్రశ్నిస్తున్న నాయకుల మీద, జర్నలిస్టుల మీద, మేధావుల మీద దాడులు శోచనీయమని తెలిపారు.

ధర్నా చేస్తున్న ఏనే కాలనీ వాసులు, సిపిఎం నాయకులు

ప్రజల కష్టాలను పట్టించుకోని పాలకులు

- తాగునీటి కోసం ఇబ్బందులు
- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి
- మున్సిపల్ కార్యాలయం ముందు సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడెం ఏనే కాలనీ ప్రజలు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈదులగూడెం ఏనే ప్రాంతంలో 350 కుటుంబలకుపైగా నివసిస్తున్నాయని, కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. రోడ్లు, డ్రయినేజీ అస్తవ్యస్తంగా ఉందని, కనీసం నడవలేని పరిస్థితి ఉందని వాపోయారు. డ్రయినేజీ లేక మురుగునీరంతా రోడ్డుపై చేరుతోందని, దాని ఫలితంగా దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయని చెప్పారు. కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు వేసి నల్లాలు బిగించారని, కానీ మంచినీరు ఇప్పటివరకు రాలేదని తెలిపారు. మంచినీరు లేక బోరు నీటితో దాహార్తి తీసుకుంటున్నారని చెప్పారు. ఎంతోమంది నిరుపేదలు అక్కడ నివసిస్తున్నారని వారికి రేషన్ కార్డులు, పింఛనూ అందడం లేదన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, మంచి నీరందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు, పాలకులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీష్‌చంద్ర, రవినాయక్, డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, రెమిడాల పరుశరాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, భావండ్ల పాండు, కౌన్సిలర్ ఎంఏ గని, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

భారీగా మంచినీళ్ల పండుగ

- సన్నాహాల్లో 'భగీరథ' అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో భాగంగా మిషన్ భగీరథ ఇంజినీరింగ్ శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 'మంచినీళ్ల' పండుగను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అద్భుతాన్ని మరోసారి ప్రజలకు తెలియజేయాలని భావిస్తోంది. రాష్ట్ర ప్రజల తాగునీటి అవసరాలు, ప్రభుత్వం చేపట్టిన చర్యలు జనంలోకి తీసికెళ్లనున్నారు. ఈ మేరకు మిషన్ భగీరథ కార్యదర్శి స్మీతా సభర్వాల్ వచ్చే సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఆ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ జి కృపాకర్‌రెడ్డి మంచినీళ్ల పండుగకు సంబంధించి సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు గురువారం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవాలు ఎలా నిర్వహించాలో రాష్ట్ర అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేసిన సంగతి తెలిసిందే. ఆ మేరకు మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజల తాగునీటి అవసరాలు తీర్చిన వైనాన్ని మంచినీళ్ల పండుగ ద్వారా వివరించనున్నారు. భారీ పైపు లైన్లు, ట్యాంకులు, వాటర్ ట్రీట్‌మెంటు పాంట్లు (డబ్ల్యుటిపి), జిఎల్‌బిఆర్‌లు తదితర నిర్మాణాలను ప్రజలకు, మీడియాకు చూపించాలని భావిస్తున్నారు. అలాగే సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)లో చెప్పినట్టుగా రూ.42 వేల కోట్లు కాకుండా, కేవలం రూ. 36 వేల కోట్లతోనే ప్రాజెక్టును పూర్తి చేసినట్టు అధికారులు చెబుతున్నారు. అవతరణ ఉత్సవాల్లో మిషన్ భగీరథ విశిష్టతను రాష్ట్ర ప్రజానికానికి వివరిస్తామని తెలిపారు. మంచినీళ్ల పండుగ షెడ్యూల్‌ను వచ్చే సోమవారం ప్రకటిస్తామని వివరించారు.

జూన్ 9న చేప ప్రసాదం పంపిణీ

- ఏర్పాట్లపై మంత్రి తలసాని సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేప ప్రసాదం కోసం వచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులకూ గురికాకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. జూన్ 9వ తేదీన నిర్వహించే చేప ప్రసాదం పంపిణీకి ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వివిధ శాఖల అధికారులు, దాతలు బత్తిన హరినాథ్ గౌడ్ కుటుంబ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ బత్తిన హరినాథ్‌గౌడ్ కుటుంబ సభ్యులు వంశ పారంపర్యంగా ఎన్నో సంవత్సరాల నుంచి చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తూ వస్తుందని చెప్పారు. కరోనా కారణంగా మూడు సంవత్సరాల తర్వాత తిరిగి ఇప్పుడు చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. చేప ప్రసాదం కోసం మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి లక్షలాది మంది వస్తుంటారన్నారు. బత్తిన సోదరుల నివాసం నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రసాదం తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. అవసరమైన చేప పిల్లలను ప్రభుత్వమే మత్స్య శాఖ ఆధ్వర్యంలో సరఫరా చేస్తోందని తెలిపారు. ప్రజలు లైన్‌లో వెళ్లే విధంగా బారికేడ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు తాగునీరు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా జనరేటర్లు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లను అందుబాటులో ఉంచుతామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్త్ క్యాంప్‌లు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి ఒకటి, రెండు రోజులు ముందే ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు ప్రజలు చేరుకునే అవకాశముందని.. వారికి జైశ్వాల్ సమాజ్, అగర్వాల్ సమాజ్, శ్రీకృష్ణ కమిటీ, బద్రి విశాల్ పిట్టి వంటి పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సేవా దృక్పథంతో అల్పాహారం, భోజనం అందించే ఏర్పాట్లు చేస్తారని, వారికి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రాజాసింగ్, ఎమ్మెల్సీ రహమతుల్లా బేగ్, కార్పొరేటర్ శంకర్ యాదవ్, వైద్య ఆరోగ్య శాఖ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, జిహెచ్‌ఎంసి కమిషనర్ లోకేష్ కుమార్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షపై స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. టిఎస్‌పిఎస్‌సి జూన్ 11న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను వాయిదా వేసేలా ఆదేశాలు జారీ చేయాలంటూ 36 మంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వివిధ నియామక పరీక్షల మధ్య వ్యవధి ఉండాలన్న నిబంధనను పాటించట్లేదని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్.. వివరణ ఇవ్వాలని టిఎస్‌సెస్‌సి చైర్మన్, కార్యదర్శికి నోటీసులు జారీ చేశారు.

ఆవులపల్లి జలాశయం పనులు ఆపాలి

- కెఆర్‌ఎంబికి సర్కారు లేఖ

ప్రజాశక్తి, -హైదరాబాద్ బ్యూరో

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఆవులపల్లి జలాశయం పనులు నిలిపి వేయకుండా ఎపి ప్రభుత్వం కొనసాగించడాన్ని వ్యతిరేకిస్తూ కృష్ణా నది యాజమాన్య బోర్డు (కెఆర్‌ఎంబి) చైర్మెన్‌కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర సాగునీటి, పారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి మురళీధర్ దాదాపు 36 పేజీల లేఖను కెఆర్‌ఎంబికి పంపారు. ఈ మేరకు పనులను వెంటనే ఆపడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వానికి మిల్లర్లు సహకరించాలి

- మంత్రి గంగుల కమలాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వానికి మిల్లర్లు సహకరించాలని పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ కోరారు. హైదరాబాద్ డాబిఆర్ అంబేద్కర్ సచివాలయంలో గురువారం మిల్లర్ల ఆసోసియేషన్ ప్రతినిధులతో యాసంగి ధాన్యం సేకరణ, సిఎంఆర్ నూక శాతం ఇతరత్రా సమస్యలపై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూక శాతంపై అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని సిఎంఆర్ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మిల్లర్ల ప్రతినిధులు మాట్లాడుతూ భారత ఆహార సంస్థ ముడి బియ్యం లక్ష్యంలో యాసంగిలో సగం కూడా రాదని తెలిపారు. కేంద్రం నిర్ణయంపై ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమం దృష్ట్యా యాసంగిలో బాయిల్డ్‌కు కేంద్రం అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయంలో తాము భాగస్వాములమే అయినప్పటికీ శత్రువులుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రి మాట్లాడుతూ, యాసంగి ధాన్యంలో నూక శాతంపై నిపుణుల కమిటీ మధ్యంతర నివేదిక సమర్పించిన నేపథ్యంలో వరి రకాలు, పరిస్థితులకు ఎలా అన్వయించాలో త్వరలో సిఎం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయించనున్నట్టు తెలిపారు. మిల్లర్లు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా యాసంగిలో ముడిబియ్యాన్ని ఇవ్వాలని కేంద్రం కోరుతుండటంతో రైతులు, మిల్లింగ్ ఇండస్ట్రీ ఇబ్బందులు పాలవుతున్నారని విమర్శించారు. ఈ నిర్ణయంపై పునరాలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్, జిఎం శ్రీనివాసరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంపా నాగేందర్, ప్రధాన కార్యదర్శి ఎ సుధాకర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి ప్రభాకర్ రావు, ట్రెజరర్ చంద్రపాల్, అన్ని జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కొత్తగా 42 వేల మందికి ఉద్యోగావకాశాలు

- ఇంగ్లాండ్, అమెరికాలో ముగిసిన కెటిఆర్ పర్యటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అమెరికా, ఇంగ్లాండ్ పర్యటనలో భాగంగా ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పలు అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు, ప్రకటనల వల్ల రాష్ట్రానికి కొత్తగా 42 వేల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. మంత్రి పర్యటన గురువారం విజయవంతంగా ముగిసింది. రెండు వారాల ఈ పర్యటనలో పలు కంపెనీలతో 80కిపైగా సమావేశాలు, ఐదు రౌండ్ టేబుల్ సమావేశాలతోపాటు రెండు కాన్ఫరెన్స్‌లలో పాల్గొన్నారు.

మంత్రి కెటిఆర్ చొరవతో వినోద రంగంలో అగ్రగామి సంస్థ అయిన వార్నర్ బ్రదర్స్- డిస్కవరీ, హెల్త్ కేర్ టెక్నాలజీలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెడ్‌ట్రానిక్, ప్రపంచంలోనే అతిపెద్ద పెట్టుబడుల సంస్థ స్టేట్‌స్ట్రీట్, బైన్, క్యాపిటల్‌కు చెందిన వివిఎస్ ఐ గ్లోబల్ సొల్యూషన్స్‌తోపాటు లండన్ స్టాక్ ఎక్సేంజ్ గ్రూప్ కంపెనీలు తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకొచ్చాయి. 12న లండన్‌లో జరిగిన 'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సుకు హాజరైన కెటిఆర్, తెలంగాణ అభివృద్ధి ప్రస్థానాన్ని వివరించారు. ఇండియా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే తెలంగాణ మోడల్‌ను అనుసరించాలన్నారు. ఈ నెల 22న అమెరికా నెవాడాలోని హెండర్సన్‌లో అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజినీర్స్ నిర్వహించిన ప్రపంచ పర్యావరణ, జలవనరుల కాంగ్రెస్‌లో మంత్రి కెటిఆర్ కీలకోపన్యాసం చేశారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టుల విజయగాథను అమెరికన్ ఇంజినీర్లకు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అమెరికన్ సివిల్ ఇంజనీర్ల సంఘం ప్రకటించిన 'ఎండ్యూరింగ్ సింబల్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రోగ్రెస్ అండ్ పార్టనర్‌షిప్' అవార్డును అందుకున్నారు. తెలంగాణలోని టైర్-2 నగరాల్లో పెట్టుబడులు పెట్టడానికి అనేక కంపెనీలు ముందుకు వచ్చాయి. 30కి పైగా కంపెనీల సిఇఒలతో కెటిఆర్ సమావేశమై టైర్-2 నగరాల్లో ఐటి కంపెనీలు తమ కార్యకలాపాలను ప్రారంభించేలా ఒప్పించారు. నల్లగొండ ఐటి టవర్‌లో 200 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ సొనాటా నిర్ణయించుకుంది. కరీంనగర్‌లో ఆపరేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తామని 3ఎమ్‌ఇసిఎల్‌ఎటిని ప్రకటించింది. తమ కార్యకలాపాలను వరంగల్‌కు విస్తరించేందుకు రైట్ సాఫ్ట్‌వేర్ రెడీ అయ్యింది. ఈ పర్యటనలో మంత్రితోపాటు ఐటి, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమో షన్, ఎన్ఆర్ఐ వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శి ఇ.విష్ణు వర్ధన్ రెడ్డి, ఇతర అధికారులు దిలీప్ కొణతం, శక్తి ఎం నాగప్పన్, ప్రవీణ్, అమర్నాథ్ రెడ్డి ఆత్మకూరి, వెంకట శేఖర్ ఉన్నారు.

పిఆర్ ఇంజినీరింగ్ శాఖ పునర్ణ్యవస్థీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖను భారీ స్థాయిలో పునర్ణ్యవస్థీకరించిన నేపథ్యంలో ఆ శాఖ ఉన్నతాధికారులు రాష్ట్ర మంత్రులను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రెబెల్లి దయాకర్‌రావును కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చారు. శాఖ పునర్ణ్యవస్థీకరణ మూలంగా పిఆర్ ఇంజినీరింగ్ శాఖ పనితీరు చాలా మెరుగుపడుతోందని, తద్వారా మంచి ఫలితాలు తీసుకురావడానికి అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఆయా స్థాయిల్లో ప్రభుత్వం ఇటీవల 87 పోస్టులను మంజూరు చేసిన సంగతి తెలిసిందే. మంత్రులను కలిసినవారిలో పిఆర్ ఇంజినీరింగ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఏజీ సంజీవరావు, సిఇ జి సీతారాములు, ఎస్ఇ అశోక్, సురేశ్‌చంద్రారెడ్డి, ఇఇ ముజీబ్, డిఇ చంద్రమౌళి తదితర అధికారులు ఉన్నారు.

హైదరాబాద్‌లో 'రూట్ పాస్'

- ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో రాకపోకలకు వర్తింపు
- ఆర్డినరీ పాస్‌కు రూ.600... మెట్రో పాస్‌కు రూ.1000
- ఈ నెల 27 నుంచి అమల్లోకి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రయాణికుల సౌకర్యార్థం తొలిసారిగా 'జనరల్ రూట్ పాస్'కు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్‌ఆర్‌టిసి) శ్రీకారం చుట్టింది. ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో రాకపోకలకు వర్తించేలా రూట్ పాస్‌ను తీసుకొచ్చింది. దీనికి సంబంధించి నెల రోజులకుగానూ ఆర్డినరీ రూట్ పాస్‌కు రూ.600, మెట్రో రూట్ పాస్‌నకు వెయ్యి రూపాయలుగా, ఐడీ కార్డుకు రూ.50గా నిర్ణయించింది. గురువారం ఈ మేరకు టిఎస్‌ఆర్‌టిసి చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్‌డి విసి సజ్జనార్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ రూట్‌పాస్‌ను ప్రయాణికులు ఆదరించాలని కోరారు. ఈ పాస్‌కు సంబంధించిన రూట్ల వివరాల కోసం ఆర్‌టిసి వెబ్ సైట్లను సంప్రదించాలని సూచించారు. మొదటగా హైదరాబాద్‌లోని 162 రూట్లలో ఈ పాస్‌ను ప్రయాణికులకు ఇవ్వనుంది. ఈ రూట్ పాస్ దారులు ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో అపరిమితంగా ఎన్నిసార్లైన బస్సుల్లో ప్రయాణించే వెసులుబాటును సంస్థ కల్పించింది. సెలువు దినాలతో పాటు ఆదివారాల్లోనూ ఈ పాస్ తో ప్రయాణించవచ్చు. హైదరాబాద్‌లో ప్రయాణికులకు ఇప్పటికే జనరల్ బస్ టికెట్ అందుబాటులో ఉంది. ఆర్డినరీ బస్ పాస్ కు రూ.1150, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్ పాస్ కు రూ.1300గా ధర ఉంది. ఈ పాస్ దారులు సిటీ సబర్బన్ పరిధిలో తిరిగే అన్ని బస్సుల్లోనూ ఎక్కడినుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు. సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు మాత్రమే ఈ పాస్‌లను కొనుగోలు చేస్తున్నారని సంస్థ చేసిన సర్వేలో వెల్లడయింది. స్వల్ప దూరం వెళ్లే ఉద్యోగులు, చిరు వ్యాపారులు బస్సుల్లో కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారని తేలింది. తక్కువ దూరం ప్రయాణించే వారికి చేరువ కావడం కోసమే జనరల్ రూట్ పాస్‌ను టిఎస్‌ఆర్‌టిసి రూపొందించింది. ప్

సన్‌స్క్రీన్లతో యువిబి కిరణాల నుంచి రక్షణ

- డాక్టర్ పి మాధవి వెల్లడి

హైదరాబాద్ : చర్మ సంరక్షణకు సరైన సన్‌స్క్రీన్ లోషన్‌ను ఎంపిక చేసుకోవాలని డాక్టర్ పి మాధవి అన్నారు. మే27న జాతీయ సన్‌స్క్రీన్ డే సందర్భంగా ఆమె సన్ స్క్రీన్ వాడకంపై పలు కీలకమైన సూచనలు, మెలుకువలను సూచించారు. బ్రాడ్ స్పెక్ట్రమ్ సన్‌స్క్రీన్లు యువిఎ, యువిబి కిరణాలను నిరోధిస్తాయన్నారు. చాలా సన్‌స్క్రీన్‌లు అధిక సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్ (ఎస్‌పిఎఫ్)ను కలిగి ఉంటాయనీ.. అయితే యువిబి కిరణాల నుండి మాత్రమే ఇవి రక్షిస్తాయన్నారు. కనీసం 30 ఫ్లస్ ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్‌ను ఎంచుకోవాలని సూచించారు. జిడ్డు చర్మం ఉన్నవారు ఆయిల్ లేని లేదా మ్యాట్ ఫినిషింగ్ ఉన్న సన్‌స్క్రీన్‌ను ఎంచుకోవాలన్నారు. సన్‌స్క్రీన్లు కాలక్రమేణా వాటి ప్రభావాన్ని కోల్పోతాయని.. కాబట్టి వాటిని ఉపయోగించే ముందు గడువు తేదీని గమనించాలన్నారు.

ఐజిసిఎస్ఇ ఫలితాల్లో డిపిఎస్ విద్యార్థుల విజయం

హైదరాబాద్ : ఐజిసిఎస్ఇ 2023 ఫలితాల్లో తమ విద్యార్థులు విజయం సాధించారని నాచారం డిపిఎస్ కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ యాజమాన్యం తెలిపింది. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆ సంస్థ చైర్మన్ మల్కా కొమరయ్య, డైరెక్టర్ పల్లవి, సిఒఒ మల్కా యశస్వి, సీనియర్ ప్రిన్సిపల్ సునీతా రావు, కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రిన్సిపల్ ఎంఎఫ్ శాంతి ఆంథోనీలు అభినందించారని పేర్కొంది. ఆరు సబ్జెక్టులల్లో శ్రీరామ్ శ్రీగిరి స్టార్ సాధించారని వెల్లడించింది.

రాష్ట్రానికి నిధుల మంజూరులో కేంద్రం వివక్ష

- కోలేటి దామోదర్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి నిధుల మంజూరులో వివక్ష చూపిస్తున్న కేంద్రంలోని బిజెపి సర్కార్ కర్ణాటకలో చూసిన చేదు ఫలితాలనే తెలంగాణలోనూ చూస్తోందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ లిమిటెడ్ చైర్మెన్ కోలేటి దామోదర్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలోని హామీ ప్రకారం ఏపీకి రూ.10,461 కోట్లు మంజూరు చేసి తెలంగాణపై వివక్ష ప్రదర్శించిందని విమర్శించారు. విభజన చట్టంలోని 94 సెక్షన్ ప్రకారం వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. మూడేండ్లుగా రూ.1,350 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, నయాపైసా ఇవ్వలేదని విమర్శించారు. వివక్షను ఎదుర్కొని సంక్షేమ రంగంలో స్వర్ణయుగాన్ని తెచ్చిన సిఎం కెసిఆర్ ఆవిష్కరించిన పథకాలకు అంతర్జాతీయ ఖ్యాతి రావడాన్ని బిజెపి అగ్ర నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా వివక్షను విడనాడి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తేస్తే ఊరుకోం..

- బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయం..
- పేదోళ్ల హక్కుకు ఎసరు పెడుతూ అమృతోత్సవాలా?
- జూన్ ఐదున కలెక్టరేట్ల ముట్టడి
- రాష్ట్ర సదస్సులో వక్తలు

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

'ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. తక్షణం మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలు ఆపాలి. లేదంటే వచ్చే ఎన్నికల్లో బిజెపిని గద్దెదించటం ఖాయం' అని పలువురు వక్తలు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పోరాడి సాధించుకున్న కష్టజీవుల ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ అమృతోత్సవాలు ఎలా జరుపుతారని ప్రశ్నించారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని, పట్టణ పేదలకూ ఉపాధి హామీ పనిని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎఐఎడబ్ల్యుయు, బికెంఎయు, డిబిఎఫ్, పిఎంసి, డిబిఎస్‌యు, టివివియు ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అ ధ్యక్షులు జి నాగయ్య, బికెఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ బాలమల్లేశ్, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పిశంకర్, టివివియు రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకటయ్య, పిఎంసి కన్వీనర్ ఎస్ శివలింగం, డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి నర్సింహల అధ్యక్షతన జరిగింది.

ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి గోపాల్‌రావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పేదలకు వరంలాంటిదని చెప్పారు. ఎన్నో పోరాటాలు.. ఎందరో త్యాగాలు.. రాజు, అరుణ్‌రాయ్‌లాంటి అధికారుల శ్రమ, అన్నిటికంటే ముఖ్యంగా యుపిఎ ప్రభుత్వంపై వామపక్షాల ఒత్తిడి ఫలితంగానే ఈ చట్టం పురుడు పోసుకుందని గుర్తుచేశారు. పేదల కోసం ఈ చట్టం రూపొందించబడిందనే కనీస ఇంగితమైనా లేకుండా ప్రభుత్వాలు దీనికి తూట్లు పొడవడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వాలకూ దీనిపై బాధ్యత ఉందని నొక్కి చెప్పారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తూనే..రాష్ట్రం చేయాల్సిన పని మరవొద్దని చెప్పారు. ఈ చట్టమే లేకపోతే..ఆకలి చావులు సంభవించేయనీ, వలసలు పెరిగేవని చెప్పారు. అది కేంద్రమైనా..రాష్ట్రమైనా ప్రజల హక్కుల్ని పోరాడి రక్షించుకోవాలన్నారు. ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రణాళికలో ఈ అంశాన్ని పొందుపర్చేలా ఒత్తిడి తేవాలని సూచించారు.

మోడీకి ఉపాధి కూలీలు గుర్తుకు రారా?

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ మోడీకి అదాని, అంబానీలపై ఉన్న ప్రేమ, ఉపాధి హామీ కూలీలపై లేదన్నారు. ప్రధాని ఆస్ట్రేలియా పర్యటనలో.. దేశాభివృద్ధిపై బాగా ఊదరగొట్టారని గుర్తుచేశారు. అదానీ, అంబానీ, టాటా, బిర్లాలు అభివృద్ధి చెందితే.. దేశం అభివృద్ధి అయినట్లేనా? అని ప్రశ్నించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఉపాధి కూలీలకు చెందిన సుమారు లక్షా 52 వేల కోట్లకు కోత పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ నిధులను తిరిగి పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే.. సర్కారు అంతు తేలుస్తామంటూ మోడీని హెచ్చరించారు. దేశ వ్యాప్తంగా 20 కోట్లమంది దళితులు, 18కోట్ల మంది గిరిజనులు ఉపాధి హామీ పనివల్ల ఆత్మగౌరవంతో బతుకుతున్నారని చెప్పారు.దీన్ని బిజెపి ప్రభుత్వం జీర్ణించుకోలేక పోతుందన్నారు. అందుకే క్రమంగా ఈ చట్టానికి పాడె కట్టేందుకు కుట్రలు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే పనిదినాలను తగ్గిస్తుందని, నిధుల కోతను విధిస్తుందని చెప్పారు. దేశంలో కేంద్ర పాలిత ప్రాంతాలను కలుపుకుని 716 జిల్లాలు, 7,168 బ్లాకులు, 2,69,453 గ్రామపంచాయతీల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఒకే రూపంలో జరిగే పని ఇదొక్కటేనని గుర్తు చేశారు. ఆరు కోట్ల 77 లక్షల కుటుంబాలకు చెందిన 15కోట్ల 78లక్షల మంది జాబ్ కార్డులు కలిగి ఉన్నారన్నారు. ఈ జాబ్‌కార్డులలో 32 కోట్ల మంది కూలీలు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరందరూ పనిచేయడానికి సిద్ధంగా ఉన్నా.. వారికి పని కల్పించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. 50శాతం మంది కూలీలకూ పని కల్పించటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని చెప్పారు.

ఏం చేసినా చెల్లుతుందన్న అహం..

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ మోడీ ఏం చేసినా చెల్లుతుందన్న అహంభావంతో ఉన్నారని విమర్శించారు. ఉపాధి హామీ కూలీల కోర్కెలు గొంతెమ్మ కోర్కెలు కావన్నారు. ఈ పథకాన్ని అటకెక్కించేందుకు ప్రయత్నిస్తే..ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కమ్యూనిస్టుల పోరాటాల వల్ల వచ్చిన ఈ చట్టాన్ని ఎలా కాపాడుకోవాలో తెలుసునని చెప్పారు.

సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాష మాట్లాడుతూ వామపక్షాలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు ఐక్యంగా యుపిఎ ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చిన ఫలితంగా ప్రతి కుటుంబానికి వంద రోజుల పని గ్యారంటీ చేస్తూ పార్లమెంట్ ఆమోదించిందని చెప్పారు. చట్టాన్ని నీరు గార్చేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ మాట్లాడుతూ కూలీలు చేసిన పనికి వారం రోజుల్లో చెల్లించాల్సిన వేతనాలు ఆరు నెలలైనా చెల్లించకుండా శ్రమ దోపిడికి పాల్పడుతున్నారని విమర్శించారు. సమ్మర్ అలవెన్స్ చెల్లించడం లేదన్నారు. పట్టణాల్లోని గృహ కార్మికులు, చెత్త కార్మికులు భవన నిర్మణా కార్మికులకు పని దొరక్క పస్తులుంటున్నారని తెలిపారు. అందుకే పట్టణ పేదలకు కూడా ఉపాధి హామీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. పిఎంసి జాతీయ కన్వీనర్ బోస్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టమొచ్చి 17 ఏళ్లయిందని, దీన్ని సక్రమంగా అమలు చేయాలంటూ డిమాండ్ చేయాల్సి రావటం బాధాకరమని అన్నారు.

అమృతకాలంలో ప్రవేశించామని అర్థిక మంత్రి చెబుతుంటే.. ఏదో అనుకున్నామని, ఇలా ఉపాధి పనిని నీరు గార్చడమేనన్నది అర్థం కాలేదని ఎద్దేవా చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్ వెంకట్రాములు సదస్సులో తీర్మానాన్ని ప్రవేశ పెడుతూ ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం వచ్చే నెల ఐదున కలెక్టరేట్లను ముట్టడించనున్నట్టు తెలిపారు. కొలతలో సంబంధం లేకుండా చట్ట ప్రకారం కూలి రూ. 272 చెల్లించాలన్నారు. రోజు కూలిని రూ.600లకు పెంచాలని డిమాండ్ చేశారు. రెండు సార్లు ఫొటోలను అప్‌లోడ్ చేసే పద్ధతిని రద్దు చేయాలన్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, పనిముట్లు, ఆటో చార్జీలు, సమ్మర్ అలవెన్స్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పని చూపని దగ్గర జాబ్ కార్డుదారులకు చట్ట ప్రకారం నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 2.64లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం మాదిరిగా పట్టణ పేదలకు ఉపాధి పనులు చేపట్టాలని కోరారు. బికెఎంయు జాతీయ నాయకులు టి వెంకట్రాములు మాట్లాడుతూ ఎన్‌డిఏ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనులను ఎత్తివేయాలని కుట్ర చేస్తోందన్నారు. పని అమలవుతున్న గ్రామాలను కొత్తగా నగర పంచాయితీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లలో కలిపి ఆ పేరుతో కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం పని కల్పించడం లేదన్నారు. చేసిన పనికి చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వకుండా అరకొర ఇస్తున్నారని చెప్పారు. పిఎంసి రాష్ట్ర కన్వీనర్‌ఎస్ శివలింగం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రిప్రసాద్, మహిళా కన్వీనర్ బి పద్మ, బికెఎంయు మహిళా కన్వీనర్ కె మహాలక్ష్మి, కె స్వరూప, కృపావేణి, టివిబియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం వెంకడయ్య, డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి నర్సింహ్మ, జాతీయ ప్రజా ఉద్యమాల ఐక్య వేదిక నాయకురాలు మీరా సంఘమిత్ర, బికెఎంయు నాయకులు కాంతయ్య, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోళ్లలో కొర్రీలపై రైతుల ఆగ్రహం

- ఎనిమిది కిలోల తరుగును వ్యతిరేకిస్తూ రాస్తారోకో
- ఎక్కువ తరుగు తీయొద్దనిఎమ్మెల్యే పెద్ది హెచ్చరిక

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం నెక్కొండ రోడ్డులోని ముగ్దపురం గ్రామంలోని ధాన్యం కొనుగోళ్లలో క్వింటాకు ఎనిమిది కిలోల తరుగు కింద కోతలు విధిస్తుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాస్తారోకో చేపట్టారు. రైస్ మిల్లర్లు కొర్రీలు పెట్టి దిగుమతి చేయడం లేదని కొనుగోలు కేంద్రం ఏజెన్సీల బాధ్యులు చెప్పారు. దాంతో రైతులు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి.. సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే సెల్‌ఫోన్‌లో అధికారులు, రైస్‌మిల్లర్లతో మాట్లాడారు. నిబంధనల మేరకు మాత్రమే తరగు తీయాలని ఆదేశించారు. రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. అక్కడే ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లు వెనువెంటనే చేపట్టి రైతులకు టోకెన్లు, గన్నీ బ్యాగులు వెంటనే ఇవ్వాలని కొనుగోలు కేంద్ర బాధ్యులను ఆదేశించారు. వాహనాల కొరత ఉన్నందున రైతులు వాహనాలను ఏర్పాటు చేసుకొని రైస్‌మిల్లులకు తరలించినట్లయితే నేరుగా రవాణ ఛార్జీలు చెల్లించడానికి అవకాశం ఉందన్నారు. కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం చేసినా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే హెచ్చరించారు.

తమ బిడ్డను ప్రేమిస్తున్నాడని యువకుడిని కొట్టి చంపారు

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

యువకుడు ప్రేమించిన యువతి పిలుపుమేరకు ఇంటికెళితే ఆమె కుటుంబీకులు అతన్ని కొట్టి చంపిన ఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలో జరిగింది. కొండమల్లేపల్లి సిఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం..కట్టంగూరు మండలం దుగినేపల్లికి చెందిన బొడ్డు సంతోష్(18)కు నల్లగొండలో తనతో పాటు ఇంటర్ చదువుకున్న కొప్పోలుకు చెందిన యువతితో గతంలో ప్రేమ వ్యవహారం సాగింది. ఈ వివాదంలో ఇరువురి తల్లిదండ్రులు గతంలో పంచాయితీ నిర్వహించి ఒకరి జోలికి మరొకరు రావొద్దంటూ తీర్మానించుకున్నారు. అనంతరం యువకుడు తల్లిదండ్రులతో పాటు సూరత్‌కు గీతవృత్తి నిమిత్తం వెళ్లాడు. గురువారం చండూరు మండలంలో తన బంధువుల ఇంటికి పండుగకు వచ్చిన సంతోష్ యువతితో ఫోన్లో మాట్లాడాడు. ఆమె పిలుపు మేరకు కొప్పోలులోని యువతి ఇంటికి వెళ్లాడు. ఇది గమనించిన యువతి నాయనమ్మ ఇంటికి గడియ వేసి కుటుంబసభ్యులకు చెప్పింది. తల్లి ఆవుల రాములమ్మ, కొడుకు మల్లయ్య కలిసి సంతోష్‌ను కర్రలతో కొట్టారు. దెబ్బలకు తాళలేక అక్కడికక్కడే సంతోష్ మృతిచెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా బందోబస్తు చేపట్టారు.

ఆర్‌టిసి కార్మికులకు వేతన సవరణ చేయాలి

- గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి
- 30న ఇందిరాపార్కు వద్ద సామూహిక నిరాహారదీక్ష : రాజిరెడ్డి

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మికులకు వేతన సవరణ చేయాలని, సంస్థలో వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించాలని ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని కోరారు. ఇవే డిమాండ్లపై ఈ నెల 30న ఇందిరాపార్కు వద్ద ఇయు ఆధ్వర్యంలో సామూహిక నిరాహార దీక్ష చేయనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2019 అసెంబ్లీ, జిహెచ్‌ఎంసి ఎన్నికల సమయాల్లో వేతన సవరణలు చేస్తామని రాష్ట్ర సర్కారు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఆర్‌టిసి కార్మికుల వేతనాలు పెంచడానికి మునుగోడు ఉప ఎన్నిక కోడ్ అడ్డుగా ఉందని, కోడ్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఇసికి రాష్ట్ర సర్కారు లెటర్ రాసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ సమయంలో టెలీకాన్ఫరెన్స్ ద్వారా వేతన సవరణ చేస్తామని కార్మికులకు మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు హామీనిచ్చారని తెలిపారు. ప్రభుత్వమిచ్చిన హామీల విస్మరణపై హైకోర్టులో తాము పిటిషన్ వేయగా.. సంస్థలో మూడు నెలల్లోగా గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. 2017,2021 వేతన సవరణ పేస్కేల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అమలు చేయాలని కోరారు. సిసిఎస్‌కు డబ్బులు చెల్లించాలని, బడ్జెట్‌లో ఆర్‌టిసికి రెండు శాతం నిధులు కేటాయించాలని కోరారు. 2013 వేతన సవరణకు సంబంధించిన ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై ఉన్నతాధికారులు వేధింపులకు అడ్డుకట్ట వేయాలని కోరారు. 30న జరిగే సామూహిక నిరాహార దీక్షను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మాతృభాషను ప్రేమించిన ఎన్‌టిఆర్

- పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ప్రజాశక్తి – కల్చరల్

మాతృ భాషను ప్రేమించి తెలుగును పాలనాపరంగాను నిత్యవ్యవహారాలలో ఎన్‌టిఆర్ అధిక ప్రాధాన్యత ఇచ్చారని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్ కళా మందిరంలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో ఎన్‌టిఆర్ శత జయంతి పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ శాసనసభ పూర్వ ఉప సభాపతి మండలి బుధప్రసాద్‌కు కిన్నెర ఎన్‌టిఆర్ భాషాసేవా పురస్కారం అందజేశారు. ప్రదానోత్సవ సభ జరిగింది ముఖ్య అతిథిగా వెంకయ్య నాయుడు పాల్గొని పురస్కరం బహుకరించి మాట్లాడారు. మాతృ భాషను విస్మరించిన వారు మాతృమూర్తిని మరచినట్లేనన్నారు బుధప్రసాద్ అనితరంగా తెలుగు భాష పరిరక్షణకు కృషి చేస్తున్న నిస్వార్థ సేవా మూర్తి అని ప్రశంసించారు. ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ అధ్యక్షత వహించిన సభలో జస్టిస్ భవానీప్రసాద్, సాహితీవేత్త వోలెటి పార్వతీశం, తదితరులు పాల్గొనగా రఘురామ్ స్వాగతం పలికారు. కార్యక్రమానికి తొలుత మిత్రా, వినోద్ బాబు,సురేఖ నీరజలు ఎన్టఇఆర్ సినిమాలలోని పాటలు మధురంగా గానం చేశారు.

శ్రీచైతన్య విద్యార్థుల రికార్డ్

ప్రజాశక్తి – హైదరాబాద్

తెలంగాణ ఎంసెట్–2023 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థులు చరిత్ర సృష్టించారని ఆ సంస్థ తెలిపింది. ఇంజనీరింగ్ స్టేట్ తొలి ర్యాంక్‌తో పాటు టాప్ 10లోపు ఆరు ర్యాంకులు సాధించగా, అగ్రి, మెడికల్‌లోని టాప్ పదిలో ఎనిమిది ర్యాంకులను సాధించినట్లు పేర్కొంది. ఇంజనీరింగ్‌లో ఎస్ అనిరుధ్ తొలి ర్యాంక్‌ను పొందారని వెల్లడించింది. ఇంజనీరింగ్‌లో వందలోపు 60 ర్యాంకులు, అగ్రి, మెడికల్‌లో వందలోపు 70 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించి సత్తా చాటారని తెలిపింది. వీరిలో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులే 67 శాతం మంది ఉన్నారన్నారని వెల్లడించింది. రెండు విభాగాల్లోనూ గత 19 ఏళ్లుగా అత్యధిక టాప్ ర్యాంక్‌లు, మార్కులు సాధించిన ఏకైక విద్యా సంస్థగా శ్రీచైతన్య నిలిచిందని ఆ విద్యా సంస్థల అకాడమిక్ డైరెక్టర్ సుష్మ అన్నారు. రాబోయే జెఇఇ అడ్వాన్స్‌డ్, నీట్‌లలోనూ తమ విజయ పరంపరను కొనసాగిస్తామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఎంసెట్‌లో ప్రగతిని కనబర్చిన విజేతలను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని శ్రీచైతన్య అధినేత డాక్టర్ బిఎస్‌రావు అభినందించారు.

నిబంధనల మేరకే ఐఆర్‌బికి ఒఆర్‌ఆర్ లీజు

- ఆ గ్రామాలకు వెళ్లే ధైర్యం కాంగ్రెస్, బిజెపిలకుందా?
- ఎమ్మెల్యేలు డి సుధీర్ రెడ్డి, కెపి వివేకానంద

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

నిబంధనల మేరకే ఐఆర్‌బి సంస్థ ఒఆర్‌ఆర్ లీజుకిచ్చినట్టు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే డి సుధీర్ రెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్ బిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెండర్ల తర్వాతే లెటర్ ఆఫ్ ఆక్సెప్టెన్స్ ఇచ్చారని, పది శాతం డబ్బు ముందే చెల్లించాలన్న నిబంధనేది లేదని స్పష్టం చేశారు. పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి శుద్ధ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డితో పాటు బిజెపి ఎమ్మెల్యే రఘునందన్‌రావు అసత్యాలను ప్రచారం చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఒఆర్‌ఆర్‌పై ప్రజలను తప్పుదోవ పట్టించినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కెపి వివేకానంద మాట్లాడుతూ కెటిఆర్ విదేశీ పర్యటనలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పెట్టుబడుల రాక, అనేక మందికి ఉపాధి దక్కడం రేవంత్‌కు మింగుడుపడడంలేదని విమర్శించారు. జిఒ 111పై రాద్ధాంతం చేస్తున్న కాంగ్రెస్, బిజెపి నాయకులు ఆ జిఒ రద్దు చేయాలని తీర్మానించిన 84 గ్రామాలకు వెళ్లే ధైర్యముందా? అని ప్రశ్నించారు.

ఏడాదికి సరిపడా ఎనర్జీ వస్తుంది..

- సమ్మర్ క్యాంపుతో పిల్లల్లో మానసికోల్లాసం
- జవహర్ బాలభవన్ డైరెక్టర్ రమణకుమార్
- బాలల పెయింటింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

జవహర్ బాలభవన్ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో ఆట, పాటల వల్ల పిల్లల్లో మానసిక ఉల్లాసంతో పాటు సృజనాత్మకత పెరుగుతోందని ఆ సంస్థ డైరెక్టర్ రమణకుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లోని జవహర్ బాలభవన్‌లో క్రియేటివ్ ఆర్ట్ సెక్షన్ ఉపాధ్యాయులు కప్పారి కిషన్ ఆధ్వర్యంలో ఆ విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో పాల్గొంటున్న చిన్నారులు ఏడాదికి సరిపడా శక్తిని కూడగట్టుకుంటున్నారని తెలిపారు. పెయింటింగ్ విద్యార్థులు బయట ఒక దృశ్యాన్ని చూస్తే వెంటనే ఒక ఐడియాతో ముందుకెళ్లేలా నైపుణ్యం సంపాదించుకుంటున్నారని తెలిపారు. పిల్లలను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు అభినందనలు చెప్పారు. భవిష్యత్తులో ఎక్కువ మంది పిల్లలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న పెయింటింగ్ ప్రదర్శన

ఒకటో తరగతి నుంచి పైతరగతులు చదువుతున్న విద్యార్థులు సమ్మర్ క్యాంపులో వేసిన పెయింటింగ్స్ ఆకట్టుకున్నాయి. ప్రకృతి, మానవ సంబంధాలు, మనుషుల అవసరాలకు వాడే పరికరాలు, సమాజంలో కనిపించే అనేక దృశ్యాలు, కుటుంబ జీవనం తదితర అంశాలను ఇతివృత్తంగా విద్యార్థులు వేసిన పెయింటింగ్స్‌ను ఆహూతులు తిలకించారు. ఆయిల్ పేస్టిల్స్, కలర్ పెన్సిళ్లు, అక్రిలిక్స్, పెన్సిల్ షేడింగ్, మిక్స్ మీడియాతో తమదైన శైలిలో వేసిన పెయింటింగ్స్ అందర్ని అబ్బురపరిచాయి. డైరెక్టర్‌తో పాటు బాలభవన్ బోధనా సిబ్బంది, తల్లిదండ్రులకు పిల్లలు వేసిన పెయింటింగ్స్ వాటి కాన్సెప్ట్, నేపథ్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల ఉపాధ్యాయులతో పాటు పలువురు సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులూ.. బీ అలర్ట్

- మార్కెట్‌లోకి కలర్‌ఫుల్ ప్యాకెట్లలో ఫేక్ సీడ్ ఎంట్రీ
- నకిలీ విత్తనంపై వ్యవసాయ, పోలీసుశాఖల నజర్
- ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో తనిఖీలకు ఆదేశాలు
- ఇప్పటికే పలు దుకాణాల్లో సోదాలు, రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

మరో వారం రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కాబోతోంది. ఇప్పటికే రైతులు దుక్కులు దున్నే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి యేడూ లాగానే ఈసారీ నకిలీ విత్తనాలు మార్కెట్లోకి దూరాయి. కలర్‌ఫుల్ కరపత్రాలు, విత్తనాలు నింపిన ప్యాకెట్లను కేటుగాళ్లు గుట్టుగా మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు. 'తక్కువ ధర.. దిగుబడి ఎక్కువ' అంటూ డీలర్లు, దుకాణదారులతో బురిడీ కొట్టించి సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. మార్కెట్‌లో పేరుమోసిన విత్తన కంపె